సాక్షి నిజామాబాద్

శుక్రవారం ׀ 22 ׀ సెప్టెంబర్ ׀ 2023



కుక్కలను తప్పించబోయి

వేగంగా వెళ్తున్న ఆటోకు వీధి కుక్కలు అడ్డురావడంతో బోల్తా పడింది. ఇద్దరు మృతి చెందారు.

- 8లో ▸



దరఖాస్తులు 66435

జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియ ఈనెల 19తో ముగిసింది.అధికారులు దరఖాస్తులను పరిశీలన చేస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /24.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచే స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సత్యనారాయణ పరిశీలించారు. అధికారులు తయారు చేసిన రూట్ మ్యాప్‌లను పరిశీలించారు. అంతకుముందు తహసీల్ కార్యాలయంలో ఎన్నికల కోసం చేపడుతున్న విధివిధానాలపై తహసీల్దార్ శ్రీధర్‌తో మాట్లాడారు. కార్యాలయం ఆవరణలో ఓటరు యొక్క ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సందర్శించారు. ఆయనతో పాటు అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు ఉన్నారు.

గొర్రెలకు వైద్య పరీక్షలు చేయాలి

- పశువైద్య అధికారులకు జేడీ జగన్నాథచారి ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

డొంకేశ్వర్(ఆర్మూర్) : రాష్ట్ర ప్రభుత్వం గొల్ల,కుర్మ,యాదవులకు సబ్సిడీపై అందజేస్తున్న గొర్రెలు రోగాలతో మృత్యువాత పడుతున్న నేపథ్యంలో జిల్లా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టింది. గురువారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన 'అమ్మేసుకుంటున్నారు' కథనంపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి స్పందించారు. ప్రభుత్వం ఇస్తున్న జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి రోగాల బారిన పడితే అవసరమైన చికిత్స అందజేయాలని మండల పశువైద్య అధికారులను ఆదేశించారు. అలాగే రోగాల బారిన పడకుండా టీకాలు వేయాలని సూచించారు. మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండి జీవాలకు వైద్య సేవలు అందించాలని, రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దన్నారు. గొర్రెలు పొందిన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, ఈ నెల 23న జిల్లా కార్యాలయంలో జరిగే ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

పదోన్నతుల్లో తప్పులు సరిదిద్దుకోండి

నిజామాబాద్‌అర్బన్ : టీచర్ల పదోన్నతుల్లో తప్పులు సరిచూసుకొని ఎడిట్ ఆప్షన్ వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గ ప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం టీచర్ కౌన్సెలింగ్‌లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందే ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్‌లో నేటి వరకు ఐచ్ఛికాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. శనివారం ఎడిట్ ఆప్షన్ కూడా వినియోగించుకోవచ్చునన్నారు. ఇదే సందర్భంలో సీనియారిటీ లిస్టు ప్రకారం ఆప్షన్‌కి ఒకటి రెండు సార్లు యుడైస్ కోడ్, ప్రాంతం, మండలం, జిల్లా, చెక్ చేసుకుని ఎంచుకోవాలన్నారు, ఒకవేళ ప్రమోషన్ అవసరం లేనట్లయితే నాట్ విల్లింగ్ తప్పనిసరి ఇవ్వాలన్నారు. కొన్ని ఆప్షన్‌లు సెలెక్ట్ చేశాక పదోన్నతి అవసరం లేకపోతే నాట్ విల్లింగ్ ఇవ్వవచ్చునన్నారు.

మోగుతున్న డెంగీ బెల్స్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ వద్ద పేషెంట్లు

SAKSHI సాక్షి గ్రౌండ్‌రిపోర్ట్ GROUND REPORT

- నగరంతో పాటు పట్టణాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- గల్లీల్లో పేరుకుపోతున్న చెత్త
- గుంతల్లో మురుగు నీటి నిల్వ
- పెరుగుతున్న దోమల బెడద

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు విస్తరించక పోవడంతో నిజామాబాద్ నగరంతో పాటు, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లోని కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడం, గుంతల్లో నీరు నిల్వడం, మురుగుకాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ఇంటి తలుపు తడుతున్నాయి. డెంగీ కేసులు పెరుగుతున్నాయి. – నిజామాబాద్‌నాగారం

నగరంలో..

నిజామాబాద్ కార్పొరేషన్‌పరిధిలో 60 డివిజన్లు ఉన్నాయి. 4.96 లక్షల జనాభా ఉంది. ఆరు శానిటేషన్ జోన్‌లలో ఒక్కో జోన్‌లో సుమారు 200 వరకు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. చెత్త సేకరణకు ఆటోలు, ట్రాక్టర్లు ఉన్నాయి. అయితే కాలనీల్లో చెత్త సేకరణకు రెండు, మూడు రోజులకు ఒక్కసారి వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పలు కూడళ్లు, రోడ్ల మీద ఎక్కడికక్కడ చెత్త నిలువ ఉంటోంది. కొన్ని ప్రాంతాల్లో రెండు నెలలకు ఒక్కసారి మురుగుకాలువలను శుభ్రం చేస్తున్నారు. మరి కొన్ని కాలనీల్లో మురుగు కాలువలు నెలలు గడిచినా శుభ్రం చేయడానికి తాత్సారం ప్రదర్శిస్తున్నారు. శివారుకాలనీలైన నాగారం, సాయినగర్, ధర్మపురిహిల్స్, బాబన్ సాహెబ్ పహాడ్, కోజాకాలనీ, చంద్రశేఖర్‌కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరంలో విలీనమైన సారంగపూర్, ఖానాపూర్, కాలూర్, మానిక్‌బండార్, బోర్గాం(కే), ముబారక్‌నగర్, గూపన్‌పల్లి, మాధవనగర్, పాంగ్రా గ్రామాల్లోనూ శానిటేషన్ అత్యంత దారుణంగా ఉంది. చెత్త సేకరణ, మురుగుకాలువలు శుభ్రం చేయడం అంతంతే ఉంది. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడే బాగుండేనని ఆయా ప్రాంతాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. నగరంలో దోమలు పెరుగుతున్నా ఫాగింగ్ చేయడంలో మున్సిపల్ సిబ్బంది మమ అనిపిస్తున్నారు.

జిల్లాలో డెంగీ కేసులు

396	189
2021లో	2022లో

ఈ ఏడాది నమోదైన మొత్తం కేసులు **188**

జనవరి	04	ఏప్రిల్	02	జూలై	13
ఫిబ్రవరి	04	మే	06	ఆగస్టు	78
మార్చి	05	జూన్	05	సెప్టెంబర్	71

ఆస్పత్రులకు పరుగులు..

నిజామాబాద్ నగర పరిధిలో డెంగీ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వరాలతో పరుగులు తీస్తున్నారు. పిల్లలు, పెద్దలు వైరల్ ఫీవర్, టైపాయిడ్ జ్వరాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు నగరంలో 90 డెంగీ కేసులు నమోదయ్యాయి.



నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ ప్రాంతంలో చెత్త చెదారం, మురుగునీరు

అప్రమత్తంగా ఉండాలి



డెంగీ జ్వరం తీవ్రమైన ఆరోగ్య సమస్య. అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాలు కీళ్ల నొప్పులు, చర్మంపై దద్దుర్లు , రక్తస్రావానికి గురికావడం వంటి లక్షణాల శ్రేణిని కలిగి ఉంటుంది. ప్రజలు దోమ కాటు నివారణకు చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఇబుప్రోఫెన్ వంటి నాన్-స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ వాడకుండా ఉండాలి. ఎందుకంటే అవి రక్తస్రావం సమస్యలను మరింత తీవ్రం చేస్తాయి. బదులుగా, నొప్పి, జ్వరం ఉపశమనం కోసం ఎసిటమైనోఫెన్‌ను ఎంచుకోవాలి. డెంగీ అనుమానం ఉన్నట్లయితే స్వీయ-ఔషధాలను ఖచ్చితంగా నివారించాలి. ఎందుకంటే సరైన వైద్య నిర్ధారణ, చికిత్సలో ఆలస్యం కావచ్చు. డెంగీని సమర్థవంతంగా నివారించడానికి, తీవ్రమైన సమస్యలను నివారించడానికి వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా అవసరం. డెంగీ నుంచి విజయవంతంగా కోలుకోవడానికి ముందస్తు రోగ నిర్ధారణ, తగిన వైద్య సంరక్షణ కీలకం.

– డాక్టర్ హితేష్‌కుమార్, జనరల్ మెడిసిన్

మురికి నీరు రోడ్లపైకి



వర్షాకాలం వచ్చింటే శర్భతీ కెనాల్‌లోని నీరు రోడ్ల మీదికి వస్తుంది. ఈ కాలువలో చెత్త చెదారం వేయడం వలన దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువ అవుతుంది. కాలువపై భాగం మూసి వేయాలని బల్దియా అధికారులకు విన్నవించినా పట్టించు కోవడం లేదు.

– ఖలీం, శర్భతీకెనాల్ వాసి

చర్యలు చేపడుతున్నాం.



పట్టణంలో ప్రతి ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాము. వర్షపు నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేస్తున్నాము. దోమల నివారణకు మురికి కాలువలు శుభ్రం చేసి ఫాగింగ్ చేస్తున్నాము. ఇంటి పరిసరాలలో చెత్త తొలగించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్



బడాభీమ్‌గల్ రోడ్డు మార్గంలో నివాసాల మధ్య ఉన్న మురికి నీటి కుంట

నివాసాల మధ్య మురికి గుంతలు

భీమ్‌గల్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

మోర్తాడ్/భీమ్‌గల్: పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య బాగానే ఉన్నా రెగ్యులర్ కమిషనర్ లేక పోవడంతో భీమ్‌గల్ పట్టణంలో నామమాత్రంగానే పారిశుద్ధ్య పనులు సాగుతున్నాయి. బడా భీమ్‌గల్ రోడ్డు మార్గంలో నివాసాల మధ్య గుంతల్లో మురికినీరు పేరుకుపోయి దోమలకు అవాసంగా మారింది. 53 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. కేవలం దుకాణాల సముదాయాల ముందు ఉన్న చెత్తను తొలిగిస్తున్నారు. నివాసాల మధ్య ఉన్న చెత్తను తొలగించకుండా, గుంతలను సైతం పూడ్చించడం లేదని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. మొత్తం 12 వార్డులలోని మెజార్టీ వార్డులలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది.

పారిశుద్ధ్యం పనులు కాకుండా...

మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికులను ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సొంత పనులకు వినియోగించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ప్రజాప్రతినిధులు పట్టణంలో పర్యటిస్తే వారికి ఆహ్వానం పలకడానికి ఫ్లెక్సీలను పారిశుద్ధ్య కార్మికులతోనే కట్టించడం గమనార్హం.



పారిశుద్ధ్య పనులు కాకుండా ఫ్లెక్సీలు కడుతున్న కార్మికులు

ఆర్మూర్‌లో డెంగీ, టైఫాయిడ్ కేసులు



రోగులతో ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి

ఆర్మూర్ : ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ 300 మంది వరకు ఔట్ పేషంట్లు వస్తున్నారు. వీరిలో 60 మందికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు వందకు పైగా టైఫా యిడ్ కేసులు, 20 డెంగీ కేసులు నమోదయ్యాయని వైద్యులు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లోకి వెళ్లే వారి సంఖ్య వందల సంఖ్యలో ఉండటం గమనార్హం. పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండగా, ఫాగింగ్ మిషన్లు సైతం పని చేయకపోవడంతో దోమల వృద్ధి అధికమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

చికిత్సను అందిస్తున్నాము..



ఆస్పత్రికి వచ్చిన రోగులను పరీక్షించి అవసరాన్ని బట్టి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాము. టైఫాయిడ్, డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల బారిన పడిన వారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్సను అందిస్తున్నాము. – డాక్టర్ నాగరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి, ఆర్మూర్

మురికి కూపాలైన కాలువలు

- పెరుగుతున్న విషజ్వరాలు
- చెదిరిన మురికి కాలువ వ్యవస్థ



బోధన్ పట్టణంలోని తట్టికోట్ వెళ్లే దారిలో మురికి కాలువ

బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ అర్బన్ హెల్త్ సెంటర్, గోషాల కాలనీలో 10 మంది వరకు డెంగీ సోకి వైద్య చికిత్సలు పొందుతున్నారు. 20 మంది విషజ్వరాతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనేక మంది విష జ్వరాలతో చికిత్సలు పొందుతున్నారు.

బోధన్ మున్సిపాలిటీలో 38 వార్డులు ఉన్నాయి. లక్షా 30 వేలకు పైగా జనాభా నివస్తిన్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, సాయిదుర్గా నగర్, సరస్వతి నగర్, ప్రగతి నగర్, గాడ్స్ కాలనీ, గోషాల, వినాయక్ నగర్ , గరీబ్ నవాజ్ కాలనీ, ఆటోనగర్, గాంధీ నగర్, గోసం బస్తీ కాలనీలోని ఇళ్ల మధ్యలో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చెత్తా చెదారం..

పట్టణంలోని రాకాసీపేట్ కాలనీ నుంచి తట్టికోట్ కాలనీల గుండా ప్రవహించే శర్భతీకెనాల్, హన్మాన్ టేక్డీ, సరస్వతినగర్, ప్రగతి నగర్ కాలనీల గుండా ప్రవహించే సాత్‌పూల్ కాలువలు మురికి కూపాలుగా మారాయి. ఈ కాలువల్లో చెత్తాచెదారం వేయడంతో నీరు నిల్వ ఉంటోంది.

బోధన్ శివారులో..

బోధన్ శివారు కాలనీలైన గరీబ్ నవాజ్ కాలనీ, ఇందిరమ్మ ఆటోనగర్, నర్సాపూర్, చెక్కిక్యాంప్, గాడ్స్ కాలనీ, ప్రెస్ కాలనీల్లో మురికి కాలువలు లేక పోవడంతో మురికి నీరు ఎక్కడికక్కడే ఇళ్ల మధ్య నిల్వ ఉంటోంది. ఫలితంగా దోమల బెడద ఎక్కువవుతోంది.

ముందు రౌడీ షీటర్లు.. వెనుక వ్యాపారులు

- జిల్లాలో విచ్చలవిడిగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా
- విభేదాలతో కత్తిపోట్లు.. హత్యలు
- నగరానికి చెందిన ముగ్గురి చేతుల్లోనే దందా

ఖలీల్‌వాడి: రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యాపారులు.. ముగ్గురు రౌడీషీటర్లను అడ్డుపెట్టుకొని రెచ్చిపోతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సబ్‌ఏజెంట్లను నియమించుకొని పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రతోపాటు ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాపారులు అధికారులు, పోలీసులను మచ్చిక చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. కాగా రేషన్‌బియ్యం అక్రమరవాణాలో తలెత్తుతున్న విభేదాలు కత్తిపోట్లు, హత్యలకూ దారితీస్తున్నాయి. ఇటీవల రెండు ఘటనలు చోటుచేసుకున్నాయి. భూతగాదాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాలో విభేదాల కారణంగా నగరంలో ఈ ఏడాది జనవరి 1న రౌడీషీటర్ ఇబ్రహీం చావుస్ అలియాస్ జంగిల్ ఇబ్బు(29) హత్యకు గురయ్యాడు. తాజాగా సిరికొండలో చోటుచేసుకున్న కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది.

రాత్రి వేళల్లో..

పీడీఎస్ బియ్యం అక్రమదందా నగరానికి చెందిన ముగ్గురు వ్యాపారుల కనుసన్నల్లో సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇతర వ్యాపారాలు చేస్తున్నట్లు నమ్మిస్తూ రాత్రివేళల్లో బియ్యం అక్రమరవాణా చేస్తున్నట్లు సమాచారం. మధ్యాహ్నం గోదాముల్లో పీడీఎస్ బియ్యం నిల్వ చేసి, రాత్రివేళ్లలో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. అప్పుడప్పుడూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేస్తున్నప్పటికీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు చేయడం లేదనే విమర్శలున్నాయి. ఆధిపత్యం కోసం ముగ్గురు వ్యాపారులు, నగరంలోని ముగ్గురు రౌడీషీటర్ల సహకారం తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. పోలీసులను తాము ప్రసన్నం చేసుకున్నామని చెప్పుకున్న ఆ ముగ్గురు వ్యాపారులు జంగిల్ ఇబ్బు హత్య తరువాత పరారైనట్లు సమాచారం. బియ్యంగా మార్చేందుకు మిల్లర్లకు ప్రభుత్వం ఇచ్చిన వడ్లకు సరిపడా బియ్యం మిల్లుల్లో నిల్వలు లేవని గతంలో ఎఫ్‌సీఐ అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే. వీటిని భర్తీ చేసుకునేందుకు మిల్లర్లు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

సిరికొండలో కత్తిపోట్లు

- సుపారీ ఇచ్చి పిలిపిస్తే ఎదురుదాడి

సిరికొండ : రేషన్ బియ్యం అక్రమ దందా కత్తిపోట్లకు దారితీసింది. సిరికొండ మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిరికొండకు చెందిన అన్సర్, రహమాన్ కలిసి రేషన్‌బియ్యం దందా నడిపేవారు. విభేదాలు తలెత్తడంతో కొన్నేళ్ల క్రితం విడిపోయారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఉంటున్న రహమాన్ తనకు రూ.22 లక్షలు ఇచ్చేది ఉందని, డబ్బులు వసూలు చేయాలని హైదరాబాద్‌లోని కాలాపత్తర్‌కు చెందిన రౌడీషీటర్ అసద్‌ను అన్సర్ సంప్రదించి.. బుధవారం రాత్రి సిరికొండకు పిలిపించాడు. అసద్‌తోపాటు ఉన్న ఐదుగురికి, జిల్లా కేంద్రానికి చెందిన తన స్నేహితులకు సిరికొండలోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో అన్సర్ విందు ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా అసద్ రేషన్ బియ్యం డబ్బుల అంశాన్ని లేవనెత్తగా, ఆ విషయం ఇప్పుడు వద్దని, తరువాత మాట్లాడుదామని విందు తర్వాత హైదరాబాద్ వెళ్లిపోవాలని అన్సర్ సూచించాడు. ఇప్పుడే వెళ్లి రహమాన్‌ను సిరికొండకు పట్టుకువద్దామని అసద్ పట్టుబట్టాడు. అన్సర్ వినక పోవడంతో అసద్ ఆగ్రహంతో కత్తితో దాడి చేశాడు. తీవ్రరక్తస్రావం అవుతుండడంతో అన్సర్‌ను అక్కడే ఉన్న వారు కారులో స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించారు. రహమాన్‌ను సిరికొండ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చామన్నారు.

కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అన్సర్, అసద్‌కు రూ.5 లక్షల సుపారీ ఇచ్చినట్లు తెలిసింది.



గాయపడిన అన్సర్



కత్తిపోట్ల ఘటన జరిగిన ఫంక్షన్ హాల్

జిల్లావ్యాప్తంగా వర్షాలు

- అత్యధికంగా చీమన్‌పల్లిలో 62.0 మిల్లీమీటర్లు నమోదు
- నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం..!

సుభాష్‌నగర్ : గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసాయి. గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9గంటల వరకు వర్షం కురిసింది. అత్యధికంగా సిరికొండ మండలంలోని చీమన్‌పల్లిలో 62.0 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులు కొంత ఉపశమనాన్ని ఇచ్చాయి. వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. రాగల రెండ్రోజులు కూడా జిల్లాలో వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తడిసిన మక్కలు

బాల్కొండ: గురువారం ఉదయం నుంచి కురిసిన వర్షాల వలన నూర్పిడి చేసి ఆరబెట్టిన మక్కలు తడిసిముద్దయ్యాయి. ఉదయం నుంచి ఎడ తెరిపి లేకుండ వర్షం కురువడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడిప్పుడే అన్నదాతలు మక్క కోతలను ప్రారంభించారు. ప్రారంభం నుంచే వర్షాలు కురువడంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. సోయా పంటకు కూడ తిప్పలు తప్పేలా కనిపించడం లేదని వాపోతున్నారు. వర్షాల వలన తడిసిన మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరతున్నారు.



రెంజర్లలో తడిసి ముద్దయిన మక్కలు

వర్షపాతం వివరాలు..

సిరికొండ	62.0					జక్రాన్‌పల్లి	23.0	ఆర్మూర్	13.0
మాక్లూర్	54.5	ఆలూరు	34.5	బోధన్	27.3	రెంజల్	18.5	నిజామాబాద్ నార్త్	12.8
నిజామాబాద్ రూరల్	35.5	నవీపేట్	27.8	ఏర్గట్ల	23.3	బోధన్	16.0	నందిపేట్	12.5
డొంకేశ్వర్	34.5					కమ్మర్‌పల్లి	14.3	కోటగిరి	11.5

క్లుప్తంగా

లండన్‌లో గణేశ్‌ నిమజ్జనం



నిజామాబాద్‌ సిటీ: లండన్‌లో తెలుగు గణేశ్‌ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా గణేశ్‌ నిమజ్జనం నిర్వహించినట్లు అధ్యక్షుడు నరేశ్‌ మేడిచెట్టి తెలిపారు. లండన్‌లో తెలుగు వారందరూ ఒకే చోట చేరి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 300 మంది సభ్యులు లండన్‌ వీధుల గుండా ర్యాలీగా వెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

స్పీకర్‌ను కలిసిన సీపీ



ఖలీల్‌వాడి: స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని బాన్సువాడలోని ఆయన నివాసంలో సీపీ సత్యనారాయణ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

ఏఈఈలో ఐశ్వర్యకు 21వ ర్యాంకు

రుద్రూర్‌: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈఈ సివిల్‌ ఇంజినీరింగ్‌ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఐశ్వర్య రాష్ట్ర స్థాయిలో 21, మహిళా విభాగంలో స్టేట్‌ ఫస్ట్‌ ర్యాంకు సాధించారు. నగరంలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్‌ కళాశాలలో డిప్లమా, హైదరాబాద్‌ ఉస్మానియాలో సివిల్‌ ఇంజినీరింగ్‌ పూర్తి చేసిన ఐశ్వర్య ప్రస్తుతం కామారెడ్డి జిల్లా బీర్కూర్‌ మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నా రు.పలువురు ఐశ్వర్యకు అభినందనలు తెలిపారు.

అక్టోబర్‌ 16 నుంచి ఓపెన్‌ ఇంటర్‌ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: ఓపెన్‌ స్కూల్‌ ఇంటర్‌, పదో తరగతి పరీక్షలను అక్టోబర్‌ 16 నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ గురువారం తెలిపారు. అక్టోబర్‌ 30 నుంచి నవంబర్‌ 6వ తేదీ వరకు ప్రాక్టికల్‌ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అర్సపల్లిలో ఆపరేషన్‌ ఛబుత్రా

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి ప్రాంతంలో పెట్రోలింగ్‌, స్థానిక పోలీసులు ఆపరేషన్‌ ఛబుత్రాను బుధవారం అర్ధరాత్రి నిర్వహించారు. అర్ధరాత్రి రోడ్లపై, హోటళ్ల వద్ద తిరుగుతున్న 60 మంది యువకులను పట్టుకొని వారి నుంచి 30 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. అర్ధరాత్రి రోడ్లపై తిరిగితే దొంగలకు, స్థానిక పౌరులను గుర్తించలేమని సీఐ చెప్పారు. మళ్లీ రాత్రివేళల్లో రోడ్లపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



చంద్రశేఖర్‌కాలనీ శంకర్‌గణేశ్‌ మండలిలో..



శ్రీచైతన్యకాలేజీలో మట్టివినాయకుడితో సెల్ఫీ



మహేశ్‌, నిజామాబాద్‌



పాలెంలో..

సెల్ఫీ విత్‌ గణేశ్‌..



పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్‌ కమ్యూనిటీ, యువ జన సంఘాల మండ పాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల కు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సప్‌ చేయగలరు.

పంపించాల్సిన వాట్సప్‌ నెం. **8978036828**



పోచమ్మగుడి గణేశ్‌ వద్ద సెల్ఫీతో కుటుంబ సభ్యులు



గాదేపల్లిలో సాయిరెడ్డి



సాయినగర్‌-2 బాయికాడి వారి నివాసంలో..

దరఖాస్తులు @ 66,435

- ముగిసిన ఓటర్ల నమోదు
- కొనసాగుతున్న పరిశీలన ప్రక్రియ
- 28వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశాలు

సుభాష్‌నగర్‌: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు–చేర్పులకు ఇచ్చిన అవకాశం ఈ నెల 19తో ముగిసింది. ఆగస్టు 21 నుంచి ఆన్‌లైన్‌లో, తహసీల్‌ కార్యాలయాలకు 66,435 దరఖాస్తులు వచ్చాయి. గ్రామాల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. బీఎల్‌వోలు తప్పుల్లేకుండా పకడ్బందీగా పరిశీలించి ఓటరు జాబితా సిద్ధం చేయాల్సి ఉంది. ఈనెల 28వ తేదీలోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అక్టోబర్‌ 4న తుది ఓటరు జాబితా విడుదల కానుంది.

కొనసాగుతున్న పరిశీలన ప్రక్రియ

ఎన్నికల సంఘం ఆగస్టు 21న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పలుమార్లు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్‌ 19 వరకు 66,435 దరఖాస్తులు రాగా అందులో కొత్త ఓటర్ల నమోదుకు 44,605, తొలగింపునకు 6,255, మార్పులు–చేర్పులకు 15,575 దరఖాస్తు వచ్చాయి. ప్రస్తుతం పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది.

అంగన్‌వాడీల సమ్మెతో పరేషాన్‌..

జిల్లావ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో (బాన్సువాడ కలిపి) 1549 పోలింగ్‌ బూత్‌లు ఉన్నాయి. 1549 మంది బీఎల్‌వోలు ఉంటారు. అంగన్‌వాడీలతో పాటు వీఆర్‌ఏలు, కారోబార్లు బీఎల్‌ఓలుగా ఉన్నారు. ప్రస్తుతం మెజార్టీ అంగన్‌వాడీలు సమ్మెలో ఉండగా, వీఆర్‌ఏలను రెగ్యులర్‌ చేసి వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారు. దీంతో సెప్టెంబర్‌ 19 వరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. తహసీల్‌ కార్యాలయంలో సిబ్బంది దరఖాస్తులతో సతమతమౌతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ తూతూమంత్రంగా కొనసాగుతుండడంతో ఓటరు జాబితా తప్పుల తడకగా వచ్చే అవకాశముంది.

అధికారులకు ఆదేశాలు

తుది ఓటరు జాబితా విడుదలకు గడువు సమీపిస్తుండడంతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తహసీల్‌ కార్యాలయ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈనెల 28లోపు జాబితాను సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో బూత్‌స్థాయిలో బీఎల్‌వోలుగా ఉన్న అంగన్‌వాడీలు సమ్మెలో ఉండడంతో తుది జాబితా గడువులోపు పూర్తి చేయడం అధికారులకు సవాల్‌గా మారింది. ఈ విషయంలో ఈఆర్‌వో, ఏఈవోలు తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నారు. జాబితా కోసం రెవెన్యూ అధికారులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.

అక్టోబర్‌ 4న తుది జాబితా..

ముసాయిదా ఓటరు జాబితాలో వచ్చిన అభ్యంతరాలు పరిశీలించిన తర్వాత అక్టోబర్‌ 4న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. తప్పులు లేకుండా జాబితాను విడుదల చేసేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు.

బోగస్‌ ఓట్ల నమోదుపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

సుభాష్‌నగర్‌: బోధన్‌లో బోగస్‌ ఓట్లు నమోదు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. బోధన్‌ నియోజకవర్గ నాయకులతో కలిసి కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోధన్‌ టౌన్‌లో మహారాష్ట్రకు సంబంధించిన వారి బోగస్‌ ఓట్లు నమోదవుతున్నాయని కలెక్టర్‌ దృష్టికి తీసుకొచ్చారు. ఒకే ఫోన్‌ నంబర్‌పై వందల అప్లికేషన్లు వచ్చాయని, ఆ నంబర్లు మహారాష్ట్రకు సంబంధించిన వ్యక్తులుగా గుర్తించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్‌ బోగస్‌ ఓట్ల నమోదుపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మోహన్‌రెడ్డి తెలిపారు. పీసీసీ డెలిగేట్‌ గంగాశంకర్‌, బోధన్‌, రెంజల్‌ మండల, టౌన్‌ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మొబిన్‌ ఖాన్‌, పాష మొయినుద్దీన్‌, ఇనాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సివిల్‌ జడ్జీల బదిలీలు, నియామకాలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ జిల్లాలో పలువురు జూనియర్‌ సివిల్‌ జడ్జీలను బదిలీ చేస్తూ మరికొందరిని నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కామారెడ్డి మొదటి అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జీగా(మొబైల్‌ కోర్టు) బి.దీక్షను నియమించారు. నిజామాబాద్‌ ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జీగా విధులు నిర్వహిస్తున్న కుష్బు ఉపాధ్యాయ్‌ను నిజామాబాద్‌ మొదటి అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జీ(నిజామాబాద్‌ బాలల న్యాయ మండలి)గా బదిలీ అయ్యారు. నిజామాబాద్‌ రెండో అదనపు జ్యుడిషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ గోపీకష్ణను ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జీగా నియమితులయ్యారు. ఇద్దరిని స్థానికంగానే బదిలీ చేశారు. ఆర్మూర్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి దీప్తి వేములను ఆర్మూర్‌ ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జీగా నియమించారు. బోధన్‌ ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి రూబినా ఫాతిమాను హైదరాబాద్‌ కూకట్‌పల్లి కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో మర్కల్‌ పూజితను నియమించారు. బోధన్‌ మొదటి అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జీగా ఎస్సంపల్లి సాయి శివ, ఆర్మూర్‌ మొదటి అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జీగా మెల్లమ్‌ రేష్మ నియమితులయ్యారు.

వ్యాపారి మోసంతో నష్టపోయిన రైతు

- ఎక్స్‌పైరీ మందులు అంటగట్టిన వైనం
- పట్టించుకోని అధికారులు



బాధిత రైతు సాయిలు

రెంజల్‌(బోధన్‌): కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు తయారైంది ఓ కౌలు రైతు పరిస్థితి. రెంజల్‌ మండలం దూపల్లి గ్రామానికి చెందిన కోనేరు సాయిలు అనే రైతు అదే గ్రామానికి చెందిన రైతు వద్ద ఎనిమిదిన్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. వరిని సాగు చేస్తుండగా పంటలో పెరిగిన గడ్డిని తొలగించేందుకు కళ్యాపూర్‌లోని పెస్టిసైడ్‌ దుకాణంలో గత నెల 29న పిచికారీ మందులను కొనుగోలు చేసి కూలీలతో పలుమార్లు మందును పిచికారీ చేయించాడు. దీంతో వేసిన పంట పూర్తిగా ఎండిపోవడంతో లబోదిబోమంటున్నాడు. స్థానిక నాయకులచే వ్యాపారి వద్దకు వెళ్లగా గడువు ఎక్స్‌పైరీ మందులు విక్రయించినట్లు గుర్తించి వ్యవసాయ శాఖ అధికారులను ఆశ్రయించారు. అధికారులు పంటను పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు పంపించినట్లు బాధిత రైతు తెలిపాడు. కలెక్టర్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. ఇప్పటికే పంటపై రూ. 2 లక్షల పెట్టుబడులు పెట్టానని అధికారులు తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

సీపీఐ నేతకు తుది వీడ్కోలు



షేక్‌బాబు (ఫైల్‌)

బోధన్‌: బోధన్‌ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు షేక్‌బాబు(56) గుండె వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. గురువారం పట్టణ కేంద్రంలోని గంజ్‌ ప్రాంతంలోని ఉన్న ఆయన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ప్రతినిధి కంజర భూమయ్య, జిల్లా కార్యదర్శి సుధాకర్‌, వామపక్ష పార్టీల నాయకులు వరదయ్య, యేశాల గంగాధర్‌, శంకర్‌గౌడ్‌, మల్లేశ్‌, ప్రజా సంఘాల జిల్లా నాయకులు బాబు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నివాళి సభలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మ మాట్లాడారు. ఆయన అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. నాయకులు దుబాస్‌ రాములు, రాజేశ్వర్‌, రాజిరెడ్డి, విఠల్‌గౌడ్‌, నాగరాజు, పలు సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

క్రీడా సమాచారం

జోనల్‌స్థాయి క్రీడాకారుల ఎంపిక



మిర్దాపల్లిలో వాలీబాల్‌ ఆడుతున్న క్రీడాకారులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆలూర్‌ మండలం మిర్దాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్‌–14, 17 బాల, బాలికల జోనల్‌ స్థాయి వాలీబాల్‌ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆలూర్‌ మండలంతో పాటు ఆర్మూర్‌, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన సుమారు 80 మంది విద్యార్థినిలు, 120 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు పీఈటీ రాజేశ్‌ తెలిపారు. అండర్‌–17 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాల, బాలికల జట్టును వేల్పూర్‌ మండలం పడగల్‌ గ్రామంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీఈటీ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కుంట శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీలు వేముల నాగభూషణం, మునిరాజ్‌, రాజేశ్వర్‌, యాదగిరి, గంగాధర్‌, మధు, ఎస్‌ఎంసీ చైర్మన్‌ అశోక్‌, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పడగల్‌లో..

వేల్పూర్‌: మండలంలోని పడగల్‌ ఉన్నత పాఠశాలలో గురువారం జోనల్‌స్థాయి అండర్‌–14, 17 వాలీబాల్‌ పోటీలు నిర్వహించారు. బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జలంధర్‌, పీఈటీలు సురేశ్‌, సుమన్‌, మల్లేశ్‌గౌడ్‌, గంగామోహన్‌, సునీత పాల్గొన్నారు.

23న బాల్‌ బ్యాడ్మింటన్‌ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి జిల్లాకు సంబంధించి బాల్‌బ్యాడ్మింటన్‌ పోటీలను ఈ నెల 23న జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ అధ్యక్షుడు మానస గణేశ్‌, కార్యదర్శి శ్యామ్‌ తెలిపారు. మాక్లూర్‌ మండలంలోని మామిడిపల్లి హైస్కూల్‌లో సబ్‌ జూనియర్‌ విభాగంలో ఎంపికలు ఉంటాయన్నారు. క్రీడాకారులు 02.01.2008 తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30 నుంచి అక్టోబర్‌ 2 వరకు ఆర్మూర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కరాటేలో జిల్లాకు 23 పతకాలు

నిజామాబాద్‌నాగారం: ఇటీవల సికింద్రాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ఇంటర్‌ స్టేట్‌ ఒకినవా డ్రాగన్‌ హార్ట్స్‌ కరాటే ఛాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన తెలంగాణ లీ మార్షల్‌ ఆర్ట్స్‌ అకాడమీ విద్యార్థులు 23 పతకాలు సాధించారు. జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ బ్రూస్‌ లీ అవార్డు గ్రహీత, నిజామాబాద్‌ జిల్లా స్పోర్ట్స్‌ కరాటే అసోసియేషన్‌ జనరల్‌ సెక్రటరీ ఎడ్ల వెంకటేశ్‌ పతకాలు సాధించిన క్రీడాకారులను గురువారం అభినందించారు. స్పారింగ్‌, కటాస్‌ విభాగాల్లో 7 గోల్డ్‌ మెడల్స్‌, 8 సిల్వర్‌ మెడల్స్‌, 8 బ్రాంజ్‌ మెడల్స్‌ సాధించారు. జిల్లాకు కరాటేలో 23 పతకాలు సాధించడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఎడ్ల వెంకటేష్‌ను, వరల్డ్‌ కరాటే యూనియన్‌ ఇండియా చీఫ్‌ ప్రెసిడెంట్‌, గ్రాండ్‌ మాస్టర్‌ ఎస్‌. శ్రీనివాసన్‌ ప్రత్యేకంగా అభినందించి అవార్డు తో సత్కరించారు. అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ పంతులుగారి సత్యం, వైస్‌ ప్రెసిడెంట్లు సునీల్‌, శ్రీనివాస్‌, ట్రెజరర్‌ ఆర్మూర్‌ శ్రావణ్‌, చీఫ్‌ అడ్వైజర్‌ గజవాడ గణేశ్‌ గుప్తా సంతోషం వ్యక్తం చేశారు.

పవర్‌ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయి బహుమతి

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ పవర్‌ లిఫ్టింగ్‌ ఛాంపియన్‌ షిప్‌ – 2023 పోటీల్లో నగరానికి చెందిన కరిపె రాకేశ్‌కు రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి సాధించాడు. ఈ నెల 16, 17వ తేదీల్లో హైదరాబాద్‌లోని అమీనాపూర్‌లో తెలంగాణ పవర్‌ లిఫ్టింగ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దల్జిత్‌ సింగ్‌, ఉపాధ్యక్షురాలు రేఖ విజేతలకు మెడల్స్‌, ట్రోఫీ అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో నందిపేట విద్యార్థి

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండల కేంద్రంలోని జడ్పీ హై స్కూల్లో పదో తరగతి చదువుతున్న సాహిత్య రాష్ట్ర స్థాయి అథ్లెటిక్‌ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. హన్మకొండలో గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి అథ్లెటిక్‌ ఛాంపియనషిప్‌ బాలికల విభాగంలో ఎం. సాహిత్య 800మీ పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది. ఈ పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే వినయ్‌ భాస్కర్‌ అందజేశారు.

క్రైం కార్నర్‌

భార్య చేతిలో భర్త హతం

- చికిత్స పొందుతూ మృతి

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో భర్తపై భార్య పెట్రోల్‌ పోసి నిప్పుపెట్టిన ఘటనలో భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన వేముల రాజు(30) తన భార్య సుజాతను మద్యం సేవించడానికి డబ్బులు కావాలని నిత్యం కొడుతూ వేధించేవాడు. బాధ భరించలేక సుజాత ఈ నెల 11న మధ్యాహ్నం రాజు ఇంట్లో నిద్ర పోతున్న సమయంలో అతనిపై పెట్రోల్‌ పోసి నిప్పు పెట్టింది. దీంతో రాజుకు మంటలు అంటుకోగా కాలిపోయాడు. సుజాత ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించింది. చావుబతుకుల మధ్య ఉన్న రాజును కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రికి తరలించింది. వరంగల్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. మృతుని భార్య సుజాతపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

కళ్యాపూర్‌లో రెండు బైకులు ఢీ

- నలుగురికి తీవ్రగాయాలు

రెంజల్‌(బోధన్‌): మండలంలోని కళ్యాపూర్‌ వద్ద గురువారం రెండు బైక్‌లు ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నిజామాబాద్‌ మండలం న్యాల్‌కల్‌ గ్రామానికి చెందిన మహిపాల్‌ సాటాపూర్‌లో పనులు ముగించుకుని బైక్‌పై వెళ్తుండగా కళ్యాపూర్‌ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో దండిగుట్టకు చెందిన ప్రకాశ్‌, వెంకటేశ్‌తో పాటు వీరన్నగుట్టకు చెందిన మీరజ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వెంకటేశ్‌కు తలకు తీవ్ర గాయం కాగా, కాళ్లు విరిగిపోయాయి. ఈ ఘటనలో బైకులు చెల్లాచెదురు పడగా రోడ్డు పక్కన నిల్చున్న ఓ మహిళకు బైక్‌ తగలడంతో తీవ్రగాయాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

తోపులాటలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని యానంగుట్ట వద్ద అన్నదమ్ముల మధ్య జరిగిన తోపులాటలో అన్న రాజా రెడ్డి(40) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌ బాబు బుధవారం తెలిపారు. ఆర్మూర్‌కు చెందిన రాజారెడ్డి, రాజ్‌కుమార్‌ అన్నదమ్ములు. ఇరు కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో రాజారెడ్డి బుధవారం పొలంలో తమ్ముడు రాజ్‌కుమార్‌ భార్యతో గొడవ పడ్డాడు. రాజ్‌ కుమార్‌ సైతం అక్కడే ఉండడంతో ఘర్షణ నెలకొంది. ఇద్దరి మధ్య జరిగిన తోపులాటలో రాజారెడ్డి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

లారీల మధ్య ఇరుక్కుని కూలీ..

కామారెడ్డి క్రైం: రెండు లారీల మధ్య ఇరుక్కుని బీహార్‌ కూలీ మృతి చెందిన ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్‌ ఆవరణలో బుధవారం చోటు చేసుకుంది. బీహార్‌కు చెందిన సంతోష్‌ కుమార్‌ (22) కొన్ని రోజులుగా కామారెడ్డిలో ఉంటూ తోటి వారితో కలిసి రైలు వ్యాగన్‌ నుంచి సరుకులు, బస్తాలను లోడింగ్‌ చేసే కూలీగా పని చేస్తున్నాడు. వ్యాగన్‌కు దగ్గరగా ఓ లారీని చేర్చుతున్న సమయంలో మరో లారీ ప్రమాదవశాత్తు ఢీకొనడంతో సంతోష్‌ లారీల మధ్య ఇరుక్కుని మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారులచే దొంగతనాలు

వర్ని: మండల కేంద్రంలో చిల్లర దొంగతనాలకు చిన్నారులను వాడుకుంటున్న ఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు పాఠశాల నుంచి బుట్టలను చిన్నపిల్లలతో దొంగతనం చేయించిన ఘటన సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇటీవల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చిల్లర దొంగతనాలు ఎక్కువయ్యాయి. చిల్లర దొంగతనాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసులను అభినందించిన మంత్రి

వేల్పూర్‌: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరస్తూ గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేస్తున్న పోలీసులను రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్మూర్‌ ఏసీపీ జగదీశ్‌చందర్‌, భీమ్‌గల్‌ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్మూర్‌ రూరల్‌ సీఐ గోవర్దన్‌రెడ్డి, ఆయా పీఎస్‌ల ఎస్సైలు, పోలీసులు సంయుక్తంగా గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, ఎంతటి వారైనా ఉపేక్షించకూడదని పోలీసులకు స్పష్టం చేశారు. జిల్లాకు కొత్త సీపీ సత్యనారాయణ వచ్చిన తర్వాత మరింత దూకుడు పెంచారని కొనియాడారు. గంజాయి నిర్మూలనలో ప్రభుత్వం పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందన్నారు. ఇలాగే పోలీసులు తమ విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

నిందితుల అరెస్ట్‌

ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఆటోను దొంగతనం చేసిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరహరి గురువారం తెలిపారు. నగరంలోని కెనాల్‌కట్టాలో నివాసం ఉంటున్న మహారాష్ట్రకు చెందిన బాలాజీ, మల్కాపూర్‌కు చెందిన చిన్నయ్య ఈనెల 19న దుబ్బ ప్రాంతంలోని పవన్‌నగర్‌లో ఓ ఇంటి ఎదుట పార్కింగ్‌చేసిన ఆటోను దొంగిలించారు. గురువారం ఆటోలో వెళ్తున్న వీరిని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

గంజాయి స్వాధీనం

నగరంలోని జీజీ కళాశాల సమీపంలో గంజాయి తాగుతున్న ముగ్గురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. వీరి నుంచి 300 గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు నిజామాబాద్‌ ఆర్సీవో అలివేలు గురువారం తెలిపారు. నిజామాబాద్‌, కామారెడ్డి, నిర్మల్‌ జిల్లాల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 5 నుంచి 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 23న తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశాల్లో కేవలం ఎస్సీ విద్యార్థులచే మాత్రమే ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం (బి) లో ఉన్న ఆర్‌సీవో కార్యాలయంలో ఈ తక్షణ ప్రవేశాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్‌, ఎంపిక పత్రం, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బోనాఫైడ్‌, ఆధార్‌కార్డులతో హాజరు కావాలన్నారు. అనాథలు, పాక్షికంగా అనాథలైన, దివ్యాంగ విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుక్కలను తప్పించబోయి ఆటో బోల్తా

- ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు
- జాతీయ రహదారిపైన ఘటన



ప్రమాదానికి గురైన ఆటో

నిజాంసాగర్‌(జుక్కల్‌): నాందేడ్‌–సంగారెడ్డి జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఆటో వీధికుక్కలు అడ్డు రావడంతో బోల్తాపడి తీవ్ర ప్రమాదం నెలకొంది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందారు. గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన ఆటోడ్రైవర్‌ సంతోష్‌ తన అమ్మ యశోదాబాయి(50)తో కలిసి దెగ్లూర్‌లోని చెల్లెలు వద్దకు ఆటోలో బయలు దేరాడు. రోడ్డు మార్గంలో ప్రయాణికులను ఎక్కించుకుంటూ హైవేపై వెళ్తున్నాడు. నిజాంసాగర్‌ మండలం బ్రహ్మణపల్లి అంజనాద్రి సమీపంలో జాతీయ రహదారిపైన వీధికుక్కలు ఆటోకు అడ్డు వచ్చాయి. సడన్‌ బ్రేక్‌ వేయడంతో వేగంగా ఉన్న ఆటో రహదారిపై పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో యశోదాబాయితో పాటు దాసరి రాములు (70) తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. సంతోష్‌తో పాటు మరో నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో నారాయణఖేడ్‌ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో యశోదబాయి మృతి చెందింది. దాసరి రాములును నారాయణఖేడ్‌ను ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రాజశేఖర్‌ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే క్షతగాత్రులను చికిత్సనిమిత్తం తరలించారు. మృతుల కుటుంబీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తల్లిప్రేమను పంచిన శునకం



పిట్లంలో ఓ కుక్క గేదె దూడకు తల్లి ప్రేమను పంచి పెట్టింది. మండలానికి చెందిన స్థానిక రైతు సురేందర్‌ వ్యవసాయ క్షేత్రంలో ఓ కుక్క పాలను గేదె దూడ తాగడం చూపరులను ఆకట్టుకుంది.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌